# శిశిరవసంతం

సింధూరం నింగిని పూసేవేళ, మందారం నేలకు రాలేవేళ బాల్కనీలో కూర్చుని వచ్చేపోయే వ్యక్తులని, వాహనాలని చూస్తున్నాడు అరవై ఏళ్ల రఘురామ్.

రఘురామ్ ఇల్లు రోడ్డుకి ఈవైపు వుంది. ఆవైపు ఇల్లు స్వప్న వాసంతది. ఆమెకి అరవై ఏళ్లు. బాల్కనీలో కూర్చుని రోడ్డువైపే చూస్తోంది.

ఓ ఇరవై ఏళ్ల అబ్బాయి మోటార్ సైకిల్‌పై చాలా వేగంగా వెళ్తున్నాడు. అతని వెనుక మరో ఇద్దరు అబ్బాయిలు కూర్చుని ఉన్నారు. వాళ్ల దుడుకుతనం చూస్తుంటే రఘురాంకి నలభై ఏళ్ల క్రితం తన కోరికలు, ఆశలు, కలలు, ఊహలు గుర్తొస్తున్నాయి.

“మోటార్ సైకిల్ కావాలి నాన్న”. ‘ఇప్పుడే వద్దురా’ అన్నాడు తండ్రి.

“ఏం?”

“నువ్వింకా పెద్దవాడివి కావాలి”.

“ఇరవై ఏళ్లు వచ్చాయి. ఇంకెంత పెద్దవాడిని కావాలి. మా ఫ్రెండ్స్ అంతా ఎప్పటి నుండో వెహికల్స్‌పై వస్తున్నారు”.

వస్తారొస్తారు. భయం వుంటేగా! ఈ ట్రాఫిక్‌లో మోటార్ సైకిల్‌పై కాలేజీకి వెళ్తావా? ఏం వొద్దు. ఒక్కడివి డ్రైవ్ చేస్తావా? అబ్బే అదేం లేదు. ఫ్రెండ్స్‌కి ఇస్తారు. ముగ్గురు నలుగురు ఎక్కుతారు. నేనిప్పుడే నీకు మోటార్ సైకిల్ కొనిచ్చేది లేదు” ఖచ్చితంగా చెప్పాడు తండ్రి.

తండ్రి ఒక్కసారి ‘నో’ అంటే అతడి చేత ‘ఎస్’ అన్పించడం చాలా కష్టమని అతనికి తెల్సు. తండ్రిని అంతకంటే గట్టిగా అడిగే ధైర్యం అతడికి లేదు. సొంతంగా కొనుక్కోటానికి అతడింకా విద్యార్థే.

మోటార్ సైకిల్‌పై వేగంగా ఫ్రెండ్స్‌తో తిరగాలనే అతని కోరిక కోరిగ్గానే మిగిలిపోయింది.

★ ★ ★

ఓ ఇరవై రెండేళ్ళ అమ్మాయి రోడ్డుపై నడిచి వెళ్తోంది. ఆఫీసునుండి ఇంటికి వెళ్తున్నట్టుంది. భుజానికి పొడవైన హ్యాండ్ బేగ్ వేళ్లాడుతోంది. ఆమెని చూస్తుంటే వాసంతికి ఆ వయస్సులో తన ఆశ గుర్తొచ్చింది.

"ఏంటే ఉద్యోగం చేస్తావా?" ఆశ్చర్యంగా అడిగింది తల్లి.

'ఆఁ'.

"ఎవడ్ని ఉద్ధరించాలని" కోపంగా అంది తల్లి.

"ఏంటీ తల్లీకూతుళ్లిద్దరూ ఘర్షణ పడ్తున్నారు?" అడిగాడు అప్పుడే ఆ గదిలోకి వస్తున్న తండ్రి.

"ఉద్యోగం చేస్తుందంట" అంది తల్లి భుజాల చుట్టూ కొంగుని కప్పుకుంటూ.

"ఏం చలం సాహిత్యం ఒంటబట్టిందా? వీల్లేదు. ఇంట్లోనుండి బయటికి కదిల్తే కాళ్లిరగ్గొడతాను" అంటూ తండ్రి విసురుగా వసారాలోకి వెళ్లిపోయాడు.

స్వప్న వాసంతికి ఆర్థిక స్వేచ్ఛ పొందాలనే ఆశ నిరాశగా మారింది.

★ ★ ★

"చీకట్లో కూర్చున్నారేంటి తాతాజీ?" అంటూ లైట్ వేసింది ఆఖరి మనవరాలు రిధమ.

ఆ పాప చేతిలో పూలు దీపపు కాంతిలో చిత్రంగా మెరుస్తున్నాయి.

ఐదురేకల పూలు.

ఆ పూలని చూస్తుంటే అతనికి స్వప్న వాసంతి గుర్తుకు వచ్చింది.

రఘురామ్, స్వప్న వాసంతిలది విశాఖ జిల్లాలోని ఓ పల్లెటూరు.

రెండు కుటుంబాల వారికి పరిచయం వుంది.

ఓ పరిచయస్థుల పెళ్లి సింహాచలం కొండపై జరుగుతుంటే రెండు కుటుంబాల వాళ్లు వెళ్లారు.

ఆర్ద్ర వర్ణంకి ఆకుపచ్చ అంచున్న పట్టు పరికిణీ, అదే రంగు జాకెట్టు, ఆకుపచ్చ ఓణీతో స్వప్న వాసంతి పెళ్లి మంటపంకి కాస్త దూరంగా కూర్చుని వుంది.

గుండ్రని కళ్లు కాటుకతో మెరుస్తున్నాయి. నుదుటిపై తిలకం బొట్టు ముచ్చటగా వుంది. చెవుల జూకాలు తమాషాగా కదుల్తున్నాయ్. నిండుగా వుంది. అయినా అలంకరణలో ఏదో లోపం. పరిశీలనగా ఆమెను చూస్తున్న అతడికి హఠాత్తుగా స్ఫురించింది. పొడవైన జడలో ఒక్క పువ్వూ లేదు.

'సింహాచలం సంపెంగలు ఎంతో బాగుంటాయ్. పెట్టుకోవచ్చుగా' అనుకున్నాడు.

స్వప్నవాసంతితో అతడెప్పుడూ మాట్లాడలేదు.

అబ్బాయిలు, అమ్మాయిలూ మాట్లాడుకోవడం చాలా పెద్ద తప్పు ఆ కుటుంబాలలో ఆ రోజుల్లో.

రఘురామ్‌కి క్షణక్షణం ఆమె మదిలో మెదులుతోంది.

'ఎంత అందంగా వుందో. చేతిలో చేయివేసి కొండపై అలా ఒక్కసారి ఆమెతో కలిసి నడిచివస్తే' అనుకున్నాడు.

ఓ సంపెగమాల ఆమె జడలో తురిమితే అనుకున్నాడు.

ఆమె ఒక్కసారి తనని చూసి నవ్వితే బాగుండును. అతడికి నవ్వొచ్చింది తన ఆలోచనలకి.

పరాయి మగవాడిని చూసి నవ్వితే బ్రతకనిస్తారా? అనుకున్నాడు. అతడు కొండపై ఒంటరిగా కూర్చుని అదేపనిగా ఆమె గురించి ఆలోచిస్తూ ఎప్పుడు రాశాడో అతడికే తెలియదు. ఐదు రేకుల పువ్వులపై అందంగా ఒక్కో రేకుపై ఆమె పేరు బాల్ పాయింట్ పెన్‌తో రాశాడు. స్వప్న వాసంతి!

అతడికి ఆ పువ్వుని మొక్కనుండి తెంపాలనిపించలేదు.

అతడు మండపం వైపు వెళ్లిపోయాడు. పెళ్లి తంతు మొదలయ్యింది.

అతడు వాసంతి కోసం వెదికాడు. ఆమె కన్పించలేదు.

జీలకర్ర, బెల్లం పెట్టే సమయానికి ఎక్కడినుండో వచ్చి ఆడవాళ్లవైపు కూర్చుంది.

ఆమెనే పరిశీలనగా చూస్తున్న రఘురామ్ తుళ్లిపడ్డాడు.

ఆమె జడలో ఐదురేకుల పువ్వు.

ఒక్కో రేకుపై స్పష్టంగా కన్పిస్తున్నాయి అక్షరాలు- స్వప్న వాసంతి. అతడికి అరచేతుల్లో చెమట పట్టింది. కాళ్లల్లో వణుకు, గుండెల్లో దడ. ఆమె జడలోకి పువ్వు ఎలా వచ్చింది?

ఆ పేరు తను రాశాడని ఆమెకి తెలుసా?

తన చేతివ్రాత ఎవరైనా గుర్తిస్తే తన తలరాత మార్చేస్తారు.

రఘురామ్ అక్కడినుండి మెల్లగా జారుకున్నాడు.

ఎన్నోసార్లు ఆఖరికి నాన్న పెళ్లి సంబంధం స్థిరపర్చే సమయంలో కూడా 'నేను స్వప్నవాసంతిని పెళ్లి చేసుకుంటాను' అని చెప్పాలనుకొని తండ్రి కులం పట్టింపు గుర్తొచ్చి ఆగిపోయాడు.

స్వప్నవాసంతి లాంటి అమ్మాయి భార్యగా లభించినా బాగుండుననుకున్నాడు. కాని అతడికి అటువంటి అమ్మాయి దొరకలేదు. దొరకక పోవడానికి కాదు వివాహ విషయంలో తండ్రిదే పెత్తనమంతా. ఆమె అతడికి ఓ అందమైన స్వప్నంగానే మిగిలిపోయింది.

★ ★ ★

ఓ యువజంట కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు. వాళ్లని చూస్తుంటే స్వప్న వాసంతికి గతంలో తన సరదాలు గుర్తొచ్చాయి.

ఆమె వివాహం రమేశ్చంద్రతో జరిగింది.

శరత్ నవలలని చూసి ఇతనెవరూ అంటే సాహిత్యం గురించి తెలియదు అనుకుంది. సాహిత్యం గురించి అతనితో మాట్లాడటం కుదర్దని తెల్సి అన్ని అభిరుచులు కలవటం సాధ్యం కాదుకదా అనుకుంది. కానీ అతడిపై తేలిక భావం ఏర్పర్చుకోలేదు.

సాయంత్రంపూట తల్లో చిన్న మరువం దండ తురుముకొని చల్లగాలిని ఆస్వాదిస్తూ అలా ఓ ఫర్లాంగు దూరం అతడితో కలిసి నడుస్తూ కబుర్లు చెప్పుకోవాలని ఆమెకి వుండేది.

'ఎందుకోయ్ కాళ్లు నొప్పులు?' అంటూ పడక కుర్చీలో కూర్చుని ఎదురింటి రామనాథంతో లోకాభిరామాయణం మొదలుపెట్టేవాడు.

లోకమంతా వెన్నెల కురిసేవేళ వాకిట్లో కుర్చీ వేసుకుని కూర్చుని పాటలు విందామండి అంటే ఎందుకోయ్ ఆరుబయట కూర్చోవడం నిద్ర దండగ అంటూ పెద్దగా ఆవలించి నిండా ముసుగు పెట్టేస్తూ 'రా' అనేవాడు. ఆమెవి చాలా చిన్న చిన్న సరదాలు. కాని ఒక్కటీ నెరవేరలేదు. చిన్న చిన్న సరదాలు, అభిరుచులు కొన్నైనా కలవకపోతే వివాహ బంధంలో మధురిమ మనసుకి తట్టదు. ఎవ్వరినైనా ప్రేమించి పెళ్లి చేసుకుంటే బాగుండేది అనుకుందామె.

అలా అనుకుందే కాని ఇల్లాలిగా ప్రతిఒక్క బాధ్యతని సమర్థవంతంగా, భర్తకి అనుగుణంగా నిర్వర్తించింది.

ఆమె సరదాలన్నీ వెలిగించని కర్పూరంలా ఆవిరైపోయాయి.

"భోజనం వడ్డించేను. లోపలికి రండత్తయ్యా" అంది పెద్ద కోడలు స్వప్నవాసంతి దగ్గరికి వచ్చి.

స్వప్నవాసంతి లోపలికి వెళ్లింది. "తాతాజీ లోపలికి రండి. రామాయణం స్టార్ట్ అవుతుంది" అంది రిధమ. రఘురామ్ ఇంట్లోకి నడిచాడు.

★ ★ ★

రాత్రి పదిన్నర.

మంచంపై వాలి కిటికీలోనుండి బయటకు చూస్తూ వాతావరణం ఎంత బాగుందో, కాసేపు అలా తిరిగొస్తే అనుకున్నాడు రఘురామ్.

ఒంటరిగా వెళ్లాలి. మరింత బాధ అనుకుంటూ లైట్ ఆర్పుతూ గోడపై ఉన్న భార్య ఫోటోవైపు చూశాడు. లిల్లీ పూలదండ వేళ్లాడుతోంది.

లిల్లీపూల వాసన ఆమెకి పడదు. బ్రతికుండగా ఒక్కనాడు ఆపూలు పెట్టుకోలేదు. ఈమధ్య నిత్యం అవే పూలు ఆ ఫోటోకి అనుకుంటూ లైటార్పి పడుకున్నాడు రఘురామ్.

★ ★ ★

మంచంపై వాలి మెరిసే నక్షత్రాలను చూస్తూ జీవితమంతా బంధాలు, అనుబంధాల మధ్యే గడిచిపోయిందే తప్ప నాకోసం నే బ్రతికిన క్షణాలున్నాయా? ఈ చరమాంకంలో మరీ ఒంటరిగా అన్పిస్తుంది. ఆయన ఉన్నా అతడి చాదస్తాన్నైనా విసుక్కుంటూ బ్రతికేదాన్ని

అనుకుందామె. భర్త ఫోటో దగ్గర వెలుగుతున్న అగరొత్తులని చూస్తూ.

★ ★ ★

రఘురాము మార్నింగ్ వాక్‌కి బయలుదేరాడు. కాస్త దూరం వెళ్లేసరికి స్వప్న వాసంతి కన్పించింది. ఆమె ప్రత్యూష పవనాల శీతలత్వాన్ని ఆస్వాదిస్తూ మెల్ల మెల్లగా నడుస్తోంది.

రఘురామ్, స్వప్న వాసంతి తమ తమ కొడుకుల ఇళ్లల్లో వుంటున్నారు. ఇద్దరికి వాళ్ల వూరిలో సొంత ఇళ్లు ఉన్నాయ్. ఎక్కడ వుండాలనిపిస్తే అక్కడుంటారు.

ఈమధ్య ఇద్దరికి ఒకరితో ఒకరికి నిమిత్తం లేకుండా గతం గుర్తొస్తున్నది. గత సాయంత్రం జ్ఞాపకాలతో కదిలిపోయారేమో ఇద్దరూ ఒకరి పక్కన మరొకరు కలిసి మెల్లి మెల్లగా అడుగులేస్తున్నారు.

ఇప్పుడు ఇద్దరికి ఆజ్ఞాపించే తల్లిదండ్రులు లేరు.

బంధంతో బాధ్యతలు పంచుకున్న భర్త, భార్య లేరు. ఆర్థిక స్వేచ్ఛా వుంది. వాక్ స్వాతంత్ర్యమూ వుంది.

ఆనాటి కోరికలు, కలలు, ఆశలు తీరని కోరికలుగా ఫలించని కలలుగా, ఆవిరై పోయిన ఆశలుగానే మిగిలిపోయాయి.

ఇప్పుడు వ్యక్తపర్చవచ్చు. కాని ఉపయోగం ఏమిటి? ఆలోచిస్తున్నారిద్దరూ.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అడిగింది స్వప్న వాసంతి.

"సింహాచలం కొండమీద పువ్వుపై అక్షరాలు ఎవరివో నీకు తెలుసా?"

"ఆ"

"ఎలా?"

"మీ అక్క పెళ్లి శుభలేఖపై నాన్నగారి పేరు రాసింది మీరేగా?"

"ఆ"

"ఆ అక్షరాలు నాకు బాగా గుర్తు. అందుకే గుర్తుపట్టాను" అందామె.

నిజం వాసంతీ. నువ్వంటే చాలా అభిమానం. కాని వ్యక్తపర్చక పోవడానికి ఎందుకు భయపడ్డానో ఇప్పటికీ అర్థం కాదు అన్నాడు రఘురామ్.

ఏ క్షణానికి ఆ క్షణమే జీవితం వాస్తవమని భ్రమపడుతుంటాం. ఆ భ్రమే మన భావాలని వ్యక్తపర్చనివ్వదు. ఏ వయస్సులో వ్యక్తపర్చాల్సిన భావాలు ఆ వయస్సులో వ్యక్తపరిస్తేనే జీవితానికి సార్థకత ఏర్పడుతుంది. కాని మనం చివరి క్షణం వరకూ ఈ విషయం గుర్తించం. ఇలా కొస్త ముందు గుర్తించినా ఆచరించం. ఎందుకంటే ఆనాడు తల్లిదండ్రులు, ఈనాడు పిల్లలు మనకి బంధాలు అందామె.

ఇద్దరూ ఓ బండరాయిపై కూర్చున్నారు.

ఆనాడు తల్లిదండ్రులకి భయపడటం వ్యర్థంగా ఇప్పుడు తోస్తున్నట్టే, పిల్లల్ని లక్ష్యపెట్టడం చివరి క్షణంలో వ్యర్థంగా అన్పిస్తే మనకేం మిగుల్తుంది?

"మనకోసం పిల్లల మనసుని కష్టపెడతామా?" అడిగిందామె.

"మనపై ప్రేమ వుంటే మన ఆనందాన్ని వాళ్లు గుర్తించాలిగా? మనల్ని ఆమోదించాలి. లేదు వాళ్లు మనం కల్సి బ్రతకటాన్ని ఇష్టపడరంటావా? వాళ్ల బ్రతుకు వాళ్లది. మనం మనవూరు వెళ్లిపోదాం. ఏమంటావ్? ఒకరికొకరు తోడు".

★ ★ ★

"ఎవరిజీవితాల్లో వాళ్లు స్థిరపడ్డారు. మీ ఇష్టాలకి నేనేనాడు అడ్డు చెప్పలేదు. ఈ చివరి దశలో నేను ప్రశాంతంగా స్వప్నవాసంతితో బ్రతకాలనుకుంటున్నాను" అన్నాడు రఘురామ్.

కొడుకు తెల్లబోయాడు, కోడలు ఆశ్చర్యపోయింది.

మనవరాలు ముద్దుగా నవ్వింది.

★ ★ ★

"ఈ వయసులో పెళ్లేంటి?" అంది స్వప్నవాసంతి కోడలు.

"పెళ్లికాదు. మేం కల్సి బ్రతుకుతాం"

"పెళ్లి లాంటిదేగా?" అన్నాడు కొడుకు.

"పేరు ఏదైతేనేం? మేం కల్సి వుండాలి" అందామె.

పరువేం కావాలి అన్నాడు కొడుకు. నలుగురూ ఏమంటారు అంది కోడలు.

స్వప్నవాసంతి వాళ్లకేం వివరించలేదు. సూట్‌కేస్ సర్దుకుంది.

★ ★ ★

రఘురామ్, స్వప్నవాసంతి ట్రైన్‌లో ఒకరి కెదురుగా ఒకరు కూర్చున్నారు. ఇద్దరి కళ్లల్లో చిన్న అసంతృప్తి.

తమ కోసం పిల్లల్ని నొప్పించామా అన్న భావం ఇద్దర్నీ బాధిస్తోంది.

ఎన్నో ఊహించి, ఏదో ఆశించి స్థిర నిర్ణయం తీసుకున్నా, అనుబంధాన్ని తిరస్కరించటం మనసుని అంతో ఇంతో బాధిస్తుంది.

• *ఆదివారం ఉదయం, 2, జులై 1989* •